# సర్వజీవులయందు ఉండు ఆత్మతత్త్వము ఒక్కటే!

**సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివం**
**సచ్చిదానందరూపం అద్వైతం సత్యం శివం సుందరం.**

**సత్యధర్మప్రేమశాంతులు లేకున్న**
**విద్యలన్నియు నేర్చి విలువ సున్న**
**సత్యధర్మప్రేమశాంతులు లేకున్న**
**దానధర్మాల సార్థకత సున్న**
**సత్యధర్మప్రేమశాంతులు లేకున్న**
**పదవులనేలిన ఫలము సున్న**
**సత్యధర్మప్రేమశాంతులు లేకున్న**
**బహుళ సత్కార్య లాభంబు సున్న**
**ఈ సనాతన ధర్మ హర్మ్యంబు నిలుప**
**గుణములియ్యవి నాలుగు గోడలప్ప**
**ఇంతకన్నను వేరెద్ది విరుకపరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ప్రేమస్వరూపులారా!

**సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు మానవుని పంచప్రాణములు**

మానవుడెన్ని విద్యలు నేర్చినను ఎంతటి పదవుల నేలినను, ఎంతటి విజ్ఞానియైనను, మానవతా విలువలు లేకుండిన యివన్నియు వ్యర్థమే! మానవుడయి పుట్టి, మానవత్వమే కోల్పోయిన మానవుడిగా రూపొందటంవల్ల ఏమి ప్రయోజనం? సత్య, ధర్మ, శాంతి, ప్రేమ,

srisathyasaivachanamrutam

అహింస. యీ ఐదు తత్త్వములు మానవుని పంచ ప్రాణములు. సత్య, ధర్మ, శాంతి, ప్రేమలను మనం అలవర్చుకున్న, అహింస మనకు సహజమైనటువంటిదిగా ఏర్పడుతుంది. సత్య ధర్మ శాంతి ప్రేమలయొక్క తత్త్వము కేవలం మానవత్వమునకే చెందినటువంటిదని మనం విశ్వసించాలి. ఈ నాల్గుకూడను ఒకదానికొకటి భిన్నమైనటువంటివి కావు. అన్యోన్య భావసంబంధమై, అనురాగతత్త్వమై, అవినాభావ సంబంధముతో ఏర్పడినవి. చక్కని ఉదాహరణము. మనం దీపపు వెలుగులో జీవిస్తున్నాము. కాని, యీ వెలుగునకు బల్బు చాలా అవసరం. అయితే యీ బల్బు వుండినంత మాత్రాన మనకు వెలుతురు రావటం లేదు. దానికొక వైరు కనెక్షన్ వుండాలి. ఈ వైరు కనెక్షన్ వుండినంత మాత్రమున ప్రయోజనంలేదు. ఆ వైరులో కరెంటు ప్రసరించాలి. కరెంటు వైరుద్వారా ప్రసరించి, బల్బులో చేరినపుడే ప్రకాశాన్ని మనం అనుభవిస్తున్నాము. కనుకనే, సత్యమే కరెంటు, ధర్మమే వైరు, శాంతియే బల్బు, ప్రేమయే, ప్రకాశము. ఈ నాల్గింటియొక్క ఏకత్వముచేతనే మానవత్వం జీవించి వుంటోంది.

### ప్రేమయే దైవము, దైవమే ప్రేమ

ప్రేమ మానవునియొక్క స్వభావము. ప్రేమయే మానవునియొక్క దివ్యత్వము. ప్రేమయే దైవము. ప్రేమయే సర్వస్వము. ప్రేమ లేకుండిన మానవుడు క్షణమైన జీవించలేడు. అయితే ఆ ప్రేమను సక్రమమైన మార్గంలో వినియోగించినపుడే మానవత్వం సార్థకమవుతుంది. ప్రేమ ఒక్కటే కాని, రెండు కాదు. దీనిని అనేక విధములయిన మార్గములలో ప్రసరింపచేసుకుంటున్నారు. తల్లి, బిడ్డల ప్రేమను 'వాత్సల్యమ'నే పేరుతో అనుభవిస్తున్నాము. భార్యా భర్తల ప్రేమను 'మోహము' అని అనుభవిస్తున్నాము. ప్రపంచమందు గల సమస్త పదార్థములయందు గల ప్రేమను 'యిచ్ఛాశక్తి' అని అనుభవిస్తున్నాము. బంధుమిత్రుల ప్రేమను 'అనురాగము' అని అనుకుంటున్నాము. భగవంతుని ప్రేమనే 'భక్తి' అంటున్నాము. కనుక ప్రేమ ఒక్కటే! మైసూర్‌పాక్, గులాబ్‌జాం, బర్ఫీ, పాలకోవా, మిఠాయి, జిలేబి ఎన్ని చేసినను అన్నిటియందు చక్కెర ఒక్కటే! చక్కెరే లేకుండిన గులాబ్‌జాం లేదు, బర్ఫీ లేదు, జిలేబీ లేదు. ప్రేమయే లేకుండిన తల్లీబిడ్డలే లేరు.

srisathyasaivachanamrutam

భార్యాభర్తలే లేరు. బంధుమిత్రులే లేరు. పదార్థమే లేదు. భగవంతుడే లేడు. ప్రేమే దైవము, దైవమే ప్రేమ. 'love is God, live in love'. కనుక ఆ ప్రేమ తత్త్వాన్ని మనం చక్కగా గుర్తించడానికి ప్రయత్నించాలి.

సర్వజీవులయందు వుండునది ఒక్క ఆత్మతత్త్వమే! ఏకాత్మ భావమును అనుసరించినపుడు, దివ్యత్వమైన జీవితాన్ని మనం అనుభవిస్తాము. బల్బులు ఎన్ని అయినా పెట్టవచ్చు. బల్బుల రంగులలో వ్యత్యాసం అనేకంగా వుండవచ్చును. ఈ బల్బులలో వోల్టేజికూడా చాలా వ్యత్యాసంగా వుండవచ్చు. కాని, కరెంటు ఒక్కటే! ప్రతీ జీవుడూ, ప్రతీ దేహమూ ఒక బల్బుతో సమానము. ఒక్కొక్కటి ఒక్కొక్క రూపనామములతో వ్యత్యాసంగా గోచరించవచ్చును. అందరియందు వున్న దైవత్వం ఒక్కటే, ఒక్కటే!

**మానవత్వమునుండి దివ్యత్వమునకు ప్రయాణం చేయడానికి మానవతా విలువలను పెంచుకోవాలి**

ప్రేమస్వరూపులారా! ఒకరినొకరు ద్వేషించరాదు. "సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి." ఎవరిని ద్వేషించినప్పటికీ మన యిష్టదైవాన్ని ద్వేషించిన వారమవుతాము. కనుక ప్రేమతత్త్వాన్ని పెంచుకోండి. మానవత్వాన్ని అభివృద్ధి పరచుకోండి. అదే జీవితముయొక్క నిజమైన లక్ష్యము. మానవుడు ఆదర్శప్రాయుడుగా వుండాలి. The proper study of mankind is man. ఏమిటీ proper study? మనసులోని యోచన, మాటలోని సూచన, క్రియలోని ఆచరణ మూడు ఏకం కావాలి. ఈనాడు మనసులో సంకల్పం ఒకటి, మాటలోని శబ్దం మరొకటి, క్రియలోని ఆచరణ మరొకటి. 'మనస్స్యన్యత్, వచస్స్యన్యత్, కర్మణ్అన్యత్ దురాత్మనమ్'. 'మనస్యేకమ్, వచస్యేకమ్, కర్మణ్యేకమ్ మహాత్మనమ్'. ప్రతీ మానవుడూ ఒక దివ్య స్వరూపుడే! మావత్వమునుండి దివ్యత్వమునకు ప్రయాణం చేయడానికి మానవతా విలువలను మనం పెంచుకోవాలి. నిత్య జీవితంలో సామాన్య మానవుడు అనుభవించేవి మూడున్నాయి. దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి. ఈనాడు పాపభీతియే లేదు. కనుక, మానవుడు కేవలం ఒక రాక్షసునివలె జీవిస్తున్నాడు. దైవప్రీతి లేదు. దైవసంకల్పముతో సృష్టించబడిన జగత్తును ప్రేమిస్తున్నాడుకాని, దైవాన్ని

sri sathyasai vahamrutam

ప్రేమించటంలేదు. దైవప్రీతి ప్రతి మానవునికికూడా అవసరం.

ప్రాచీన కాలమునుండి భారతీయసంస్కృతి అగాధమనియు అనేకత్వముతో కూడిన ఏకత్వాన్ని జగత్తంతా ప్రచార ప్రబోధలు సల్పి దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన జీవితాన్ని అనుభవిస్తూ వచ్చింది. ఈనాటి మానవుడు సుఖశాంతులను అనుభవించాలని అనేక విధములైన ప్రయత్నములు చేస్తున్నాడు. నిర్విరామ కృషితో, నిరంతర తాపత్రయములతో, అంతులేని ఆశలతో, అర్థంకాని ఆలోచనలతో, అప్రాప్తరూపమైన ప్రాప్తములకోసం ఆరాటపడే మానవునికి దిక్కు చూపే చక్కని జ్యోతులు, ఆధ్యాత్మిక దీపికలు.

**భగవన్నామస్మరణే కలుషిత వాతావరణమును పరిశుద్ధము చేసే ఫిల్టరు**

ప్రేమస్వరూపులారా! ఆధ్యాత్మిక తత్త్వాన్ని అత్యవసరంగా మనం అనుభవించాలి. మన శాంతి సుఖములుకాని, భద్రతలు కాని ఆధ్యాత్మికమునందే అణిగి వుంటున్నవి. భగవంతుని నామస్మరణం చేయాలి. ఆవరించిన మలినమైన యీ వాతావరణాన్ని పరిశుద్ధం చేయాలి. ఈనాడు జగత్తునందు శబ్దస్పర్శరూపరసగంధములన్నీకూడా మాలిన్యంగా రూపొందాయి. కలుషసంబంధమైన మాలిన్యంగా రూపొందినాయి. ఈ వాతావరణాన్ని పరిశుద్ధము చేయాలంటే పవిత్రమైన ఫిల్టరు నామస్మరణే! ఆ భగవత్ నామస్మరణ ద్వారా అనేకత్వముతోకూడిన ఏకత్వము వాతావరణములో చేరి వాతావరణాన్ని పవిత్రం గావిస్తుంది. కనుక, నగర సంకీర్తనలు చేయాలి. తెల్లవారి లేచిన తక్షణమే పరిశుద్ధమైన వాతావరణమునందు, చల్లని గాలిలో, మెల్లని తత్త్వాన్ని అనుభవిస్తూ పవిత్రమైన భగవత్ నామస్మరణ చేస్తే వాతావరణము పరిశుద్ధమవుతుంది. దీనికి మించిన సాధన మరొకటి లేదు.

**(తేదీ 28-01-1992న ఉదయం ధర్మక్షేత్రంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisathyasaivahamrutam